## మైనార్టీ గురుకుల అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరణ

మైనార్టీ గురుకుల అడ్మిషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 14 : మైనార్టీ గురుకుల అడ్మిషన్ల పోస్టర్‌ను కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లాలోని మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ఎల్‌సీ భానుమతి, గురుకుల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

అదనపు కలెక్టర్ మాధురి

కంది ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మాధురి

కంది, మే 14 : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్ మాధురి సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం కందిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తీసుకొచ్చి మూడు రోజులవుతన్న ఆన్‌లోడ్ కాలేదని, ఈ మూడు రోజులకు రోజుకు రూ. 3 వేల చొప్పున ట్రాక్టర్ కిరాయిలు చెల్లిస్తున్నామని పలువురు రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. లారీల కొరత లేకుండా వెంటవెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఆకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఆశాజ్యోతి, సంబంధిత అధికారులు ఉన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ఝరాసంగం, మే 14 : కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయానికి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సీఎం వచ్చే మార్గంలో గల గ్రామాల్లో పారిశుధ్యం, మొక్కల సంరక్షణ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ పథకానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను సీఎం చేతుల మీదుగా పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకొని సంబంధిత రికార్డులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మేదపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని గ్రామస్తులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ వెంటనే పారిశుధ్యం పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో డీపీవో సాయిబాబా, ఆర్డీవో రాంరెడ్డి, జడ్పీ సీఈవో జానకిరామ్ రెడ్డి, డీఎల్పీవో అమృత, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో సుధాకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు తనిఖీ

జిన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ జంగారెడ్డి

జిన్నారం, మే 14 : జిన్నారం, ఊట్ల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ జంగారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు నమోదు చేసిన రిజిస్ట్రర్ల తోపాటు ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 17శాతం కంటే తక్కువ తేమ ఉంటే వేగంగా కొనుగోలు చేయాలన్నారు. ఐకేపీ ఏపీఎం నరేందర్, సిబ్బంది లతా, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

**ఐకేపీ సిబ్బంది నిర్వాకంపై రైతుల ఆగ్రహం**

జిన్నారం మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సిబ్బంది తీరుపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమయపాలన పాటించడం లేదని, కొనుగోలు కేంద్రంలో 80 కిలోల తూకానికి 5 కిలోలు తీసి తూకం వేస్తున్నారని మండిపడుతున్నారు. స్థానికంగా జరుగుతున్న నిర్వాకంపై అధికారులు తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## వైభవంగా రాజగోపురం కలశ ప్రతిష్ఠాపన

ఆదర్శ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అమ్మవారి ఫోటోను అందజేస్తున్న ఆలయ కమిటీ

రామచంద్రాపురం, మే 14 : భారతీనగర్ డివిజన్‌లోని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన రాజగోపురం కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాజగోపురంపైన కలశ ప్రతిష్ఠాపన పూజలను పూజారులు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రాజగోపురం కలశ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి దంపతులు, ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి సతీమణి గీతాభూపాల్‌రెడ్డి పాల్గొని కలశ పూజలను నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సన్మానించి అమ్మవారి ఫోటోలను అందజేశారు. మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పనులు సకాలంలో పూర్తి చేయాలి

సిద్దిపేట, మే14: స్వచ్ఛ భారత్ మిషన్, అమృత్ 2.0, ఇతర మున్సిపల్ పనులను సకాలంలో పూర్తి చేయాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి టీకేశ్రీదేవి అన్నారు. బుధవారం స్వచ్ఛభారత్ మిషన్, అమృత్ 2.0 ఇతర మున్సిపల్ పనులపై ఏసీఏబీలు, మున్సిపల్ కమిషనర్లతో హైదరాబాద్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా చూడాలని, మున్సిపల్ వార్డుల్లో 24 గంటల నీటి సరఫరా కోసం ముందుగా ఏదైనా ఒక వార్డును గుర్తించాలన్నారు. మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

# వేళాపాలా లేని విద్యుత్ కోతలు

- మరమ్మతుల పేరుతో చీటికి మాటికి అంతరాయం
- విసిగెత్తి పోయితున్న జనం
- రోజుకు పదుల సంఖ్యలో పవర్‌కట్
- మండలంలో 13371 కనెక్షన్లు
- ఇబ్బందుల్లో అన్నదాతలు

కొండాపూర్ సబ్ స్టేషన్

కొండాపూర్, మే 14 : మండల పరిధిలోని గ్రామాల్లో వేసవిలో కరెంటు కష్టాలు కనిపిస్తన్నాయి. చాలా గ్రామాల్లో రోజుకు 5 నుంచి 10 సార్లు కరెంటు పోయి రావడంతో మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతున్నాయి. మరో వైపు అప్రతిటిత విద్యుత్ కోతలు, ఉక్క పోతతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల ముందుగానే ప్రకటించి కరెంటు కోతల విధిస్తున్నారు. ఇదేమంటే మరమ్మతుల పేరుతో మాట దాటవేస్తున్నారు. రోజు రోజుకీ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండంతో కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరిగింది. తద్వారా ఫీడర్లపై లోడు పెరగడంతోనే కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అనధికారికంగా సిబ్బంది పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నార కావస్తున్నా ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెప్పపాటున కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండేది కాదు. వర్షకాలం గాలి దుమారాలకు సైతం ముందస్తు ప్రణాళికలు ఉండేవి. ప్రస్తుతం అవేమి పట్టనట్లు అధికారులు సిబ్బంది వ్యవహరిస్తున్నారని కొండాపూర్ మండలంలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. గాలి దుమారం ఏర్పడినప్పుడు మరమ్మతుల పేరుతో గంటల కొద్ది సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. కొండాపూర్ మండల పరిధిలోని గ్రామాలకు కొండాపూర్ 33-11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలైన కొండాపూర్, గొల్లపల్లి, తొగర్‌పల్లి మేన్‌లైన్ నుంచి విద్యుత్ సరఫారా అవుతుంది. చిన్నపాటి వర్షాలు గాలి దుమారాలకు సైతం తరుచూ అంతరాయం ఏర్పడుతున్నది. కొన్నిసార్లు రాత్రులంతా నిద్ర లేకుండా గడపుతున్నామని, అధికారులకు ముందస్తు ప్రణాళికలు లేక పోవడం ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో సమస్య మరింత జటిలం కావాడానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకుని కరెంటు సక్రమంగా సరఫరా చేయాలని కోరుతున్నారు.

### రోజుకూ 5 నుంచి 10 సార్లు అంతరాయం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అధికంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెప్పపాటు అంతరాయం ఏర్పడేది కాదు. అసలు ఈ ప్రభుత్వానికి ఏమైంది. రోజులో 5 నుంచి 10 సార్లు కరెంటు పోతుంది.. వస్తుంది. ఇదేంటని అధికారులను అడిగితే ఆసమస్యలు, ఈ సమస్యలు ఉన్నాయని మ్యానేజ్ చేస్తున్నారు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

-అరవింద్‌రెడ్డి, రైతు,గారాకూర్తి

### ఎప్పుడు పోతదో.. ఎప్పుడు వస్తదో

పూర్తిగా విద్యుత్ అంతరాయం లేని రోజు అంటూ లేదు. ఎప్పుడు.. పోతదో ఎప్పుడు వస్తదో తెలియదు. కరెంటు లేకపోతే ఎలాంటి పనులు చేయలేని పరిస్థితి. ప్రభుత్వం ప్రజలు, రైతులను మస్తు ఇబ్బందులకు గురి చేస్తుంది. కేసీఆర్ హయాంలో కరెంటు తిప్పలు ఇట్లా ఉండేది కాదు. ఇదంతా రైతుల కర్మ. ఇంకా ఏమి చేస్తం ఓట్లేసినం తప్పదిక అనుకుంటాం. గత ప్రభుత్వం రైతులను ఎన్నడు ఇంత బాధ పెట్టలేదు.

-బుచ్చయ్య, రైతు, తొగర్‌పల్లి

## వధూవరులకు ఆశీర్వాదం

వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీమంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు కొత్తప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి

రామచంద్రాపురం, మే 14 : తెల్లాపూర్ మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నేత మల్లేపల్లి లలితా సోమిరెడ్డి దంపతుల పెద్ద కుమారుడు మల్లేపల్లి రాహుల్‌రెడ్డి వివాహం బోరంపేటకు చెందిన కృష్ణారెడ్డి కూతురు మహేశ్వరిరెడ్డితో బుధవారం శంషాబాద్‌లోని కెఎల్‌సీసీ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరై వధూవరులను ఆశ్వీరదించారు. ఎమ్మెల్యేలు కొత్తప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్, బొల్లారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**జిన్నారంలో..**

జిన్నారం, మే 14 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బొల్లారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొలను రోజా బాల్‌రెడ్డి దంపతులు బుధవారం ఫంక్షన్ హాల్‌లో కలిశారు. ఈ మేరకు మున్సిపాలిటీలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులను కేటీఆర్‌కు వివరించారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి దంపతులు

## రైతులు మెళకువలు పాటించాలి

నాగిరెడ్డిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

కోహీర్, మే14 : పంటల సాగులో మెళకువలు పాటించి రైతులందరూ అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ తబస్సుమ్ ఫాతిమా, డాక్టర్ హరి అన్నారు. బుధవారం కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కోరారు. సేంద్రియ ఎరువులను ఉపయోగించి పంటల సాగు ఖర్చును కూడా ఆదా చేయాలని సూచించారు. సమావేశంలో ఏవో నవీన్ కుమార్, ఏఈవో ప్రశాంత్, కార్యదర్శి నాగయ్య, రైతులు ఉన్నారు.

## వైభవంగా సీతారామచంద్రస్వామి విగ్రహప్రతిష్ఠ

పూజలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు

గుమ్మడిదల, మే14 : మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగులో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలను వేదపండితులు వైభవంగా నిర్వహించారు. బుధవారం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం మూల విరాట్టులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవేడుకలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్, మాజీ ఎంపీటీసీలు గోవర్ధన్‌గౌడ్, అభిశెట్టి నారాయణ, నాయకులు మంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొని పూజలు చేశారు.

## వర్షం నీటితో ప్రయాణికుల ఇబ్బందులు

కిషన్‌నాయక్ తండా వద్ద బీటీ రోడ్డుపై గుంతల్లో వర్షం నీరు

సిర్గాపూర్, మే 14 : మండలంలోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి రోడ్లపై వర్షపు నీరు చేరింది. బుధవారం తెల్లవారు జామున మండలంలోని ఉజలంపాడ్, వంగ్ఢాల్, వాసర్, గౌడ్‌గాం, పోట్‌పల్లి, కిషన్‌నాయక్‌తండా, వాలుతండా, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసి పంట చేలల్లో, చిన్నవాగులు, కుంటల్లో వర్షం నీరు చేరాయి. కిషన్ నాయక్ తండా సమీపంలో రోడ్డు గుంతల్లో వర్షం నీరు చేరి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుంతల పడిన రోడ్డును మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

**జిన్నారంలో..**

జిన్నారం, మే 14 : జిన్నారం మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. భారీ ఉరుముల శబ్దాలు, మెరుపులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దాదాపు అరగంటసేపు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు వరదతో జలమయంగా మారాయి. జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఉక్కపోతనుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

**రాయికోడ్‌లో..**

రాయికోడ్, మే 14 : మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం కురిసిన వర్షం, ఈదురు గాలులతో చెట్లు విరిగి పోయాయి. భారీగా ఈదురు గాలులు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుకు గురయ్యారు. రైతులు తమ పంట పొలాల్లో వేసిన పంటకు నష్టం వాటిల్లింది.

## 99వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

నల్లవల్లిలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రైతు జేఏసీ నాయకులు, మహిళలు

గుమ్మడిదల, మే 14 : ప్యారానగర్ డంపింగ్‌యార్డును రద్దు చేయాలని చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 99వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాలు సభ్యులు సంయుక్తంగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సర్కారు, జిల్లా యంత్రాంగం స్పందించకపోవడం అన్యాయమని రైతుల జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేసుకోవాలని డిమాం డ్ చేశారు.

## సేంద్రియ ఎరువులతో రైతాంగానికి మేలు

రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్

మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములునాయక్

కంది, మే 14 : సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రి య ఎరువుల వాడకాన్ని పెంచాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్ రైతాంగానికి సూచించారు. బుధవారం కంది మండలం కాశీపూర్‌లో వ్యవసాయ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట శాస్త్రవేత్తల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు పంట మార్పిడీలు చేస్తూ అధిక దిగుబడులు సాధించాలని, పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యతపై రైతులకు వివరించారు. వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ స్పందన మాట్లాడుతూ సాగు ఖర్చుల తగ్గుదల, రసాయణ ఎరువులతో కలిగే నష్టాలను రైతులకు వివరించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీ వో మహేందర్ రెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీ నివాస్, వ్యవసాయ విస్తీరణ అధికారి బీనా, శాస్త్రవేత్తలు కిషన్, సత్యనారాయణ,వ్యవసా య విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## లక్ష్మీనగర్ రోడ్డు సమస్య పరిష్కారం

ముస్లిం మైనార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భిక్షపతి

జిన్నారం, మే 14 : 'రోడ్డు ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు' శీర్షికన ఈనెల 9న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ భిక్షపతి, సీఐ రవీందర్ రెడ్డి బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ నగర్ సర్వేనెంబర్ 139 లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించారు. అనుమతులకు విరుద్ధంగా రోడ్డు మార్గంలో ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టవద్దని ముస్లిం మైనార్టీ ప్రతినిధులను అధికారులు హెచ్చరించారు. ఈ మార్గం గుండా స్థానికులు పరిశ్రమలకు వెళ్లేందుకు రాకపోకలు సాగించే వీలుగా 12 ఫీట్ల రోడ్డును వదిలివేయాలని మైనార్టీ ప్రతినిధులను తహసీల్దార్ కోరారు. ఈ వ్యవహారంపై ఎలాంటి అభ్యంతరాలు లేవనెత్తకుండా కాలనీలోని ఇరువర్గాలకు నచ్చజెప్పి ఒప్పించారు. అక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. చెప్పినట్లుగానే వారం రోజుల వ్యవధిలో రోడ్డు సమస్య పరిష్కారానికి చొరవ చూపిన అధికారులకు కాలనీవాసుల తరపున స్థానిక నాయకులు లక్ష్మారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు ప్ర సాద్, ఎస్సై దశరథ్, ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, సర్వేయర్ సంగీత, మైనార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి

ఉపాధ్యాయ వృత్తాంతర శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయలక్ష్మి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 14 : శిక్షణలో నేర్చుకున్న విషయాలను పాఠశాలల్లో అమలు చేయాలని పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం పోతిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయ వృత్తాంతర శిక్షణ కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాలోని పలు కుట్టు కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఉచిత యూనిఫామ్ కుట్టుపనులను పరిశీలించారు. అక్కడి నుంచి పాఠ్యపుస్తకాల గోదామ్‌ను సందర్శించి పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంపై ఆరా తీశారు. డీఈవో వెంకటేశ్వర్లు, ఏఎంవో బాలయ్య, సీఎంవో వెంకటేశం, కోర్సు డైరెక్టర్లు విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా

జహీరాబాద్, మే 14 : పేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో భరోసానిస్తున్నదని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ వార్డులకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ. 2.56,500 చెక్కులను వారు అందజేశారు. నాయకులు అశోక్ చారి, యాకూబ్, వెంకటేశం, పద్మజ, అశోక్ రెడ్డి, పాండు ముదిరాజ్, నరేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## చెత్త తొలిగింపు

అమీన్‌పూర్, మే 14 : అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ మండే మార్కెట్ వద్ద రహదారికి ఇరువైపులా పేరుకపోయిన చెత్తను బుధవారం శానిటేషన్ అధికారులు తొలిగించారు. అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి పర్యటించి, పేరుకుపోయిన చెత్తపై శానిటేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉదయం నుంచి శానిటేషన్ సిబ్బం ది జేసీబీలతో చెత్తను క్లీయర్ చేశారు.

## సమయపాలన పాటించకుంటే చర్యలు

జహీరాబాద్, మే 14 : ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ వైద్యులు సమయపాలన పాటించాలని లేని పక్షంలో శాఖపరమైన చర్యలు ఉంటాయని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర అన్నారు. బుధవారం జహీరాబాద్ ఏరియా దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యుల సమయపాలన, హాజరు పట్టికలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓపీ సేవలు, వార్డులను తనిఖీ చేసి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యుల పనితీరు, హాజరుపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌కు సూచించారు.

## ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

సిర్గాపూర్, మే14 : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని గిరిజన బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం పొందేందుకు విద్యార్థినులు మే 16న జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ లిక్కి శైలజ బుధవారం తెలిపారు. ఈ మేరకు టెన్త్ మార్కుల జాబితా 2024-25, టీసీ, ఆదాయ ధ్రువీకరణ, మూడు కలర్ పాస్ ఫొటోలు, ఆధార్, స్పోర్ట్స్, పీహెచ్‌సీ, ధ్రువీకరణ పత్రాలతో శుక్రవారం ఉదయం 11 గంటలకు పీవీటీజీ కళాశాల హయత్‌నగర్‌లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆమె తెలిపారు. వివరాలకు ప్రిన్సిపాల్ సిర్గాపూర్ సెల్ నెంబర్ 8333925391కు సంప్రదించాలని సూచించారు.

## సమస్యలు పరిష్కరించాలి

జహీరాబాద్, మే 14 : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండలాభివృద్ధి కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో తాగునీరు, కరెంట్, అంతర్గత, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లు తదితర నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రాంరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా తదితరులు ఉన్నారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కోహీర్, మే14 : కోహీర్ పట్టణంలోని రైల్వే గేటు నంబర్.14సమీపంలో మంగళవారం రాత్రి రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వికారాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మునిపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన వినోద్ కుమార్ (24) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు.